డీడీఓ భవనాలకు హంగులు

- మరమ్మతులకు రూ.95.70 లక్షలు
- ఒకే భవనంలో మూడు కార్యాలయాలు
- జిల్లా పరిషత్ నుంచి నిధులు విడుదల

కర్నూలు న్యూసిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరు డివిజన్ కేంద్రాల్లోని కార్యాలయాల మరమ్మతులకు రూ.95.70 లక్షలు కేటాయించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలను అన్ని హంగులతో త్వరలో ప్రారంభించనున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత డీడీఓ కార్యాలయాలకు మరిన్ని అధికారులను కట్టబెట్టింది. కర్నూలు, ఆదోని, పత్తికొండ, నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డీడీఓ కార్యాలయాల్లోనే పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి డివిజనల్ పంచాయతీ అధికారి, డ్వామా ఏపీడీ కార్యాలయాలను కూడా ఈ భవనంలోనే ఏర్పాటు చేస్తున్నారు.

మిగతా 7లో...

వృద్ధుల కోసం ప్రత్యేక చట్టాలు

- కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి 6



మాట్లాడుతున్న కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి

పెట్రోల్ బంకుల్లో వసతులేవి?



పెట్రోలు బంకుల్లో అన్ని వసతులు, ఉచిత సేవలకు అవకాశం ఉందా? లేదా? అనేది చూసి అనుమతులు ఇవ్వాలి. అధికారులు వాటిని కేవలం కాగితాలకే పరిమితం చేశారు. సదుపాయాలు లేవని ఎవరైనా ప్రశ్నిస్తే బంకుల యజమానులు బెదిరిస్తున్నారు. మామూలుగా అయితే మండలస్థాయిలో తహసీల్దార్ నుంచి జిల్లా స్థాయిలో పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేయాలి. కానీ అంతా నామమాత్రంగా జరుగుతోంది. ఈ సమస్యలపై ఆయిల్ కంపెనీలకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

- జిల్లాలో 75 శాతం బంకుల్లో దుస్థితి
- కేవలం పత్రాలకే పరిమితమై అనుమతులు జారీ
- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ అధికారులు

నంద్యాల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సుమారుగా 140 నుంచి 150 పెట్రోల్ బంకులు ఉన్నాయి. అందులో 75 శాతానికి పైగా కనీస సదుపాయాలు లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా వాటిల్లో కనీసం మంచినీరు కూడా లేదు. కొన్ని బంకుల్లో మరుగుదొడ్లకు తాళాలు వేశారు. పెట్రోల్ బంకుల పక్కనే వేరే వారితో పంక్చర్, ఇంజన్ ఆయిల్ మార్చే చిరు దుకాణాలను కూడా ఏర్పాటు చేయించారు. టైర్లకు గాలి కొట్టించుకోవడం కోసం వారి వద్దకు వెళ్లితే రూ.10 వసూలు చేస్తున్నారు. ఇవన్నీ ఉంటేనే పెట్రోలు బంకులకు అనుమతి ఇవ్వాలి. కానీ వీటిని కాగితాల్లో చూపించి అనుమతులు తీసుకుంటున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే అనుమతులు ఇచ్చేస్తున్నారు.

పెట్రోలు బంకుల్లో ఉండాల్సిన సదుపాయాలు...

- ప్రథమ చికిత్స కిట్లు ఉండాలి. వాటిల్లో మందులను ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి.
- మంచినీటి సదుపాయం ఉండాలి.
- మూత్రశాలలు, మరుగుదొడ్లు, శుభ్రంగా ఉంచుకోవాలి.
- గాలి నింపేందుకు, తనిఖీ చేసేందుకు యంత్రం ఉండాలి. అందుకు ఒక వ్యక్తి అందుబాటులో ఉండాలి.
- పెట్రోల్ బంకుల్లో నాణ్యత అనుమానంగా ఉంటే తనిఖీ చేసుకోవచ్చు. వాటికి సంబంధించిన పరికరాలు, ఫిల్టర్ కాగితాలు బంకుల్లో ఏర్పాటు చేయాలి.
- ఫిర్యాదులు, సలహాలకు ఓ పెట్టె అందుబాటులో ఉంచాలి. ఈ సేవలన్నీ అందరూ ఉచితంగా పొందవచ్చు.

జిల్లాలో కొన్ని పెట్రోలు బంకుల్లో పరిస్థితి..

- నంద్యాల నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్న ఒక వ్యక్తి హైవేలో పెట్రోలు పట్టించుకున్నాడు. మూత్రశాలకు వెళ్లాలని అడగగా తాళం వేసిందని, అది కేవలం సిబ్బందికి మాత్రమే అని అక్కడున్న వారు అన్నారు.
- నంద్యాల ప్రథమ నంది ఆలయం సమీపంలో ఉన్న ఒక పెట్రోల్ బంకులో టైర్లకు గాలి కొట్టే వ్యక్తి లేడు. డబ్బులు ఇచ్చి బయట గాలి కొట్టించుకోమని అక్కడున్న సిబ్బంది చెప్పారు.
- బండిఆత్మకూరు పరిధిలో ఒక పెట్రోల్ బంకులో మరుగుదొడ్డి సౌకర్యం లేదు.



గాలి మిషన్ ఉన్న పని చేయచేయని బంకు

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు కల్పించాల్సిన కనీస సదుపాయాలు లేకుంటే ఫిర్యాదు చేయాలి. బంకుల్లో టోల్ ఫ్రీ నెంబర్ ఉంటుంది. దానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బంకుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. నాణ్యత, సౌకర్యాలు పక్కగా ఆమలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

రవిబాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి, నంద్యాల

ఉల్లి సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

- డోన్‌లో పర్యటించిన కేంద్ర బృందం



రైతులకు సూచనలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

డోన్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంట సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ హెల్ఫర్ హార్టిటెక్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ బీజే బ్రహ్మ రైతులకు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తిమ్మాపురం, కామగానిగుంట్ల గ్రామాల పరిసరాల్లో వేసిన ఉల్లి పంటలను ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం పరిశీలించింది. ఉల్లి పంటకు సంబంధించిన వివరాలను రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ బీజే బ్రహ్మ మాట్లాడుతూ ఉల్లి పంట సాగుకు డ్రిప్‌ను ఉపయోగించుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం అందించే రాయితీల ద్వారా అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐ డీహెచ్ డివిజన్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్ అండర్ సెక్రటరీ మనోజ్, పీఎం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ రాజీవ్ కుమార్, హార్టి స్టాట్ యూనిట్ ఏడీ హేమాంగ భార్గవ్, గుంటూరు డీడీహెచ్ జమదగ్ని, కర్నూలు ఎన్‌హెచ్ఆర్ డీఎఫ్ చీఫ్‌హెడ్ ఎం.శర్వానంద్, సైంటిస్ట్ ఠాగూర్ నాయక్, జిల్లా ఉద్యాన అధికారి యు.నాగరాజు, జి.కళ్యాణి, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల హత్య దారుణం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఆరుగురు మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడం దారుణమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం ఆదోని ఆవకాయ ఫంక్షన్ హాల్‌లో మావోయిస్టుల హత్యపై ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది దేశం నిర్ఘాంతపోయే ఎన్‌కౌంటర్ అన్నారు. విజయవాడ, గుంటూరు, ఏలూరు, కాకినాడ, విజయవాడ ప్రాంతాల్లో టార్గెట్ చేసి మావోయిస్టులను పట్టుకొని కాల్చి చంపారన్నారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్ ప్రచార ఆర్భాటమేనని అన్నారు. ఈ సమ్మిట్ ద్వారా రాష్ట్ర ప్రజలను ప్రభుత్వం దగా చేసిందని ఆరోపించారు.

అన్నదాతకు సుఖీభవ

నంద్యాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కష్టాలు కడగళ్ల మధ్య భారంగా జీవిస్తున్న రైతులకు ఒకింత ఊరట కలిగింది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ కింద బుధవారం రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. రెండో విడత సుఖీభవ కింద ఒక్కో రైతుకు రూ. 7 వేలు చొప్పున జిల్లాలోని 3,89,595 మంది రైతులకు రూ. 139.71 కోట్లు జమయ్యాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మంత్రులు పయ్యావుల కేశవ్, ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యేలు, కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కార్తీక్ తదితరులు ఈ పథకం మెగా చెక్కులను అందజేశారు.

- రైతుల ఖాతాల్లో రూ. 139.71 కోట్లు జమ
- మెగా చెక్కులు విడుదల చేసిన మంత్రులు పయ్యావుల కేశవ్, ఫరూక్, ఎమ్మెల్యేలు
- కష్టకాలంలో రైతులకు లబ్ధి
- అన్నదాతల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ నిధులు

డోన్ నియోజకవర్గం బేతంచెర్ల మండల పరిధిలోని ఎంబాల గ్రామంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరులు, ఆర్డీవో నరసింహులు హాజరై చెక్కుల పంపిణీ చేశారు. గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీడీఏ మద్దిలేటి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ హరిబాబు తదితరులు హాజరై చెక్కులను అందజేశారు. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని బొల్లవరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరై చెక్కులను అందజేశారు. ఉయ్యాలవాడలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, బనగానపల్లెలోని కృషి విజ్ఞాన కేంద్రంలోని నిర్వహించిన కేవీకే ధనలక్ష్మి, మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఏడీఏ సుధాకర్, వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఆత్మకూరులో నిర్వహించిన కార్యక్రమానికి మార్కెట్ యార్డు చైర్మన్ వంగాల క్రిష్టారెడ్డి, ఏడీఏ హేమలత, తహసీల్దార్ రత్నరాధిక, కూటమి నాయకులు హాజరై రైతులకు చెక్కులు అందజేశారు.

- కష్టకాలంలో రైతులకు లబ్ధి...

జిల్లా వ్యాప్తంగా పంటలకు గిట్టుబాటు లేక.. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ వల్ల కూడా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో తాజాగా జిల్లా వ్యాప్తంగా రెండు పథకాల కింద 3,89,595 మందికి రూ. 139.71 కోట్లు జమ చేశారు.

- జిల్లాలో నియోజకవర్గాల వారిగా లబ్ధి ఇలా..

నియోజకవర్గం	రైతులు	అన్నదాత సుఖీభవ	పీఎం కిసాన్
నంద్యాల	12,953	రూ. 6.48	రూ. 2.31
నందికొట్కూరు	36,734	రూ. 18.37	రూ. 6.57
శ్రీశైలం	25,018	రూ. 12.51	రూ. 4.57
డోన్	35,011	రూ. 17.51	రూ. 6.12
పాణ్యం	12,691	రూ. 6.35	రూ. 2.37
ఆళ్లగడ్డ	42,981	రూ. 21.49	రూ. 7.64
బనగానపల్లె	40,664	రూ. 20.33	రూ. 7.10
మొత్తం	2,06,052	రూ. 103.03 కోట్లు	రూ. 36.68 కోట్లు



జిల్లెల్ల గ్రామంలో రైతులకు చెక్కు అందజేస్తున్న మంత్రి ఫరూక్

- పేద వర్గాలకు అండగా కూటమి

గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల పేద ప్రజలకు అండగా నిలుస్తోంది. సూపర్-6 హామీలను అమలు చేసి ఆయా వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోంది. అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ రెండో విడత కింద జిల్లా వ్యాప్తంగా రూ. 139.71 కోట్లు జమ చేశాసింది.

\- ఎన్ఎండీ ఫరూక్, మంత్రి

- రైతులకు చేయూతగా ఆర్థిక సాయం



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక సాయం రైతులకు చేయూతగా నిలు స్తోంది. రైతులకు జమ చేసిన నగదును సద్వినియోగం చేసుకోవాలి. సాగు ఖర్చులకు రైతులు ఇబ్బందిపడకూడదనే ఆర్థిక సాయం చేస్తోంది.

\- కలెక్టర్ రాజకుమారి

- రుణపడి ఉంటాను



మాకు ఉన్న ఎకరా పొలం ఉంది. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కింద అందిస్తున్న ఆర్థిక సాయం మాకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

సుందరమ్మ, యంబాయి

- అండగా కూటమి ప్రభుత్వం



గత ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలుగా నష్టాలే. సబ్సిడీ లేకుండా చేశారు. కూటమి ప్రభుత్వం పలు సబ్సిడీల ద్వారా రైతులకు అండగా ఉంటోంది.

ఉమా శంకర్, జిల్లెల్ల

- వైసీపీ విఫలం



గత వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కింద రైతులకు అంతంత మాత్రంగానే నగదు జమ చేశారు. చాలా మంది రైతులకు ఇవ్వలేదు. ఇప్పుడు సకాలంలో నగదు జమ చేయడం చాలా సంతోషంగా ఉంది.


\- మౌలాలి, చాగలమర్రి

- సబ్సిడీతో రైతులకు లబ్ధి



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ రూపంలో రైతులకు ఎంతో సాయం చేస్తున్నాయి. పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ నగదుతో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసుకుంటాం.

\- హరి ప్రసాద్, యంబాయి



శ్రీశైలంలో పొగమంచు

శ్రీశైలంలో చలి పంజా

- పది రోజులుగా పది డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత
- మంచుపొగతో కనిపించని క్షేత్ర వీధులు
- వణికిపోతున్న పిల్లలు, వృద్ధులు



తెల్లవారుజామున పొగమంచులో ప్రధాన ఆలయం

శ్రీశైలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలోని శ్రీశైల క్షేత్రం పరిసర ప్రాంతాల్లో చలి పంజా విసురుతోంది. రోజురోజుకూ చలి తీవ్రత పెరిగిపోతోంది. పదిరోజులుగా పది డిగ్రీల అత్యల్ప స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. తెల్లవారు జామున పొగమంచుతో క్షేత్ర వీధులు కనిపించడం లేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. శీతాకాలం ప్రారంభమైన నవంబరు తొలి వారం నుంచే చలి తీవ్రతతో పిల్లలు, వృద్ధులు వణికిపోతున్నారు. చలిగాలుల వల్ల వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

శివోహం..

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు అమావాస్య పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. ఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం సాక్షి గణపతికి, సాయంత్రం క్షేత్రపాలకుడు జ్వాలా వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఆలయ దక్షిణ మాడవీధిలోని ధర్మపథం కళావేదికపై రాజమండ్రికి చెందిన సుమాంజలి నాట్యాలయం బృందం చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. విభూది లోవరాజు బృందం దక్షయజ్ఞం అంశంపై బుర్రకథా నిర్వహించింది.

\- శ్రీశైలం (ఆంధ్రజ్యోతి)



రైతులు బాగుండాలి

- వారి సంక్షేమమే ధ్యేయం
- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



ఎంబాయి గ్రామంలో సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

బేతంచెర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు బాగుండాలి. వారు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. రైతుల సంక్షేమమే మా ప్రభుత్వం లక్ష్యం..' అని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బేతంచెర్ల మండలంలోని ఎంబాయి గ్రామంలో జరిగిన 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' జిల్లా స్థాయి కార్యక్రమానికి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ రాజకుమారి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాకు సంబంధించి మొత్తం రూ.2,06,052 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.103.03 కోట్ల మెగా చెక్కును విడుదల చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక మాత్రమే కాకుండా జాతీయ ఆర్థిక వ్యవస్థకు పునాది అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు కుటుంబానికి నేరుగా ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ రాబోయే ఆరు నెలలో డోన్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి ఇప్పిస్తామని కోట్ల హామీ ఇచ్చారు. రైతులు పంట సాగు నుంచిమార్కెట్ వరకు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రభుత్వం గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ సందర్భంగా డోన్ నియోజకవర్గానికి చెందిన 3,5011 మంది రైతులకు రూ.23.63 కోట్ల చెక్కును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, వ్యవసాయ శాఖ ఏడీఏ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కోట్ల రామచంద్ర రెడ్డి, ఆర్డీఓ నరసింహులు, డోన్ అబ్జర్వర్ కేసీ హరి, రైతులు పాల్గొన్నారు.

బాల్యానికి భరోసా





- హక్కులతో ఆకాంక్షను నెరవేర్చుకునే మార్గం
- సక్రమంగా అమలుకు నోచుకోని బాలల హక్కులు
- నేడు ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవం

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంచీ, చెడులను పూర్తిగా అర్థం చేసుకోలేని బాలలకు హక్కులేంటి అనుకుంటున్నారా..? పిల్లల స్వేచ్ఛను దోచుకునే పెద్దలున్న చోట వారి కోసం హక్కులుండటం తప్పని సరి. మన సమాజంలోని బలహీనుల్లో, దోపిడీకి గురయ్యేవారిలో పిల్లలు కూడా ఉన్నారు. బాల్యానికి రక్షణ కల్పించాలంటే పిల్లలకు తప్పక కొన్ని హక్కులు ఉండాలి. బాల్యాన్ని కాపాడాలనే సంకల్పంతో ఐక్యరాజ్యసమితి పిల్లల హక్కుల కోసం ఒక ఒప్పందాన్ని ఆమోదించింది. చైల్డ్ రైట్స్ కన్వెన్షన్ (సీఆర్‌సీ)గా పేర్కొనే ఈ ఒప్పందం గురించి, అందులో పేర్కొన్న హక్కుల గురించి ప్రత్యేకంగా ప్రచారం చేయడానికి ప్రతి ఏటా నవంబరు 20న ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుతున్నారు. వివిధ దేశాల్లో బాలల రక్షణకై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఏటా ఓ నినాదంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది 'నా రోజు.. నా హక్కులు' అనే నినాదాన్ని ఎంపిక చేశారు.

బాలల హక్కులు ఇవే

భారత రాజ్యాంగం 18ఏళ్లలోపు బాలలందరికీ పలు హక్కులను కల్పించింది. సమానత్వం, కులం, మతం, జాతి, భాష, ఆడ, మగ, పుట్టుక ప్రదేశం వంటి ఏ విధమైన వివక్షను ఎవరి పట్లా చూపరాదు. బిడ్డ పుట్టగానే పేరు, జాతీయత కలిగి ఉండటం, తల్లిదండ్రులతో కలిసి జీవించడం బాలల హక్కు. బాలలను అక్రమంగా రవాణా చేయడం, వ్యభిచార వృత్తిలో దించడం, జీతాలకు పెట్టడం నేరం. అలాగే బాలలు వారి అభిప్రాయాలను పాటలు, బొమ్మలు, ఆటలు, రచనల ద్వారా వ్యక్తం చేయవచ్చు. బాలలు తమకు నచ్చిన మతాన్ని కలిగి వుండవచ్చు. ప్రభుత్వాలు బాలల రక్షణకై శిశు సంరక్షణాలయాలు నిర్వహించాలి. తల్లిదండ్రులు ఇద్దరూ పనుల్లోకి వెళ్లినట్లయితే ఆ బాలల బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి. పిల్లలను ఎవరైనా హింసించినా, దౌర్జన్యం చేసినా, వేధించినా నేరమే. శరణార్థులుగా మారిన బాలలకు మానవత్వంతో సాయం చేయాల్సిన బాధ్యత సమాజంపై ఎంతైనా ఉంది. మానసికంగా, శారీరకంగా వికలాంగులైన వారి వృద్ధికి వారిలో ఆత్మవిశ్వాసం పెంపుదలకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఉచిత నిర్బంధ విద్యను పొందడం బాలల హక్కు. ప్రమాదకరమైన పనులు, గనుల్లో, పేలుడు పదార్థాల తయారీలో, హోటళ్లలో బాలల్ని పనిలో వుంచుకోరాదు. మాదకద్రవ్యాల నుంచి బాలలను దూరం చేయాలి. బాలల్ని నిర్బంధించరాదు. లైంగిక దూషణ చేయరాదు. 18ఏళ్లలోపు వయస్సు బాలల్ని విడుదల చేయడానికి వీలులేని నేరాలకు ఉరిశిక్ష గాని, యావజ్జీవశిక్ష గాని విధించరాదు.

బాల కార్మికుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రథమ స్థానం

బాల కార్మికుల్లో రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం రోజుకు 6గంటలు పనిచేసే 6నుంచి 14ఏళ్ల మధ్య ఉన్న బాల కార్మికులు సుమారు 70వేల మంది వరకు ఉన్నట్లు తెలిసింది. మరో 30వేల మందికి పైగా బడి బయట ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేకించి ఎమ్మిగనూరు బాల కార్మికులు ఎక్కువ ఉన్న మండలంగా గుర్తింపు ఉంటే ఆ తర్వాతి స్థానాలను నందవరం, హొళగుంద, కోసిగి, గోనెగండ్ల, దేవనకొండ, పెద్దకడబూరు మండలాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

పిల్లల్ని బడికి పంపించాలి



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి పిల్లల్ని బడికి పంపించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. అలాంటప్పుడే బాలల హక్కులను కాపాడవచ్చు. తల్లిదండ్రులు విద్య ప్రాముఖ్యతను గుర్తించి పిల్లల్ని పాఠశాలలకు పంపాలి. ప్రభుత్వం కూడా పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. కొట్టాలచెరువు గ్రామంలో గతంలో డ్రాపౌట్స్ అధికంగా ఉండేవి. కానీ పిల్లల తల్లిదండ్రులకు విద్య పట్ల అవగాహన కల్పించి గ్రామంలోని విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా ప్రయత్నం చేసి వందశాతం జీఈఆర్‌ను సాధించాం.

- వెంకటేష్, ఉపాధ్యాయుడు, కొట్టాలచెరువు గ్రామం

వృద్ధుల కోసం ప్రత్యేక చట్టాలు

- కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి



హాజరైన వృద్ధులు, తదితరులు

నందికొట్కూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పిల్లల నుంచి నిరాధరణకు గురవుతున్న వృద్ధ తల్లిదండ్రులు వారి నుంచి బరణం పొందే చట్టాలు ఉన్నాయని కర్నూలు జిల్లాన్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి అన్నారు. బుధవారం నందికొట్కూరులోని శ్రీకాళీ ప్రసాద ఆశ్రిత ఆశ్రమంలో నల్సా న్యూమ్యాడ్యుల్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅథితులుగా జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి, కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ వెంకట హరినాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కబర్ధి మాట్లాడుతూ తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007 ప్రకారం పిల్లల నుంచి నిరాదరణకు గురైన తల్లిదండ్రులు చట్ట ప్రకారం వారి నుంచి భరణం పొందే హక్కు ఉందన్నారు. ఉచిత న్యాయ సహాయం, విద్యా హక్కు కోసం 1098 హెల్ప్ లైన్, మహిళా హెల్ప్‌లైన్ నెంబర్ 181, న్యాయ సహాయం కోసం హెల్ప్‌లైన్-15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబరు 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబరు 14456 తదితర అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పల్లె ప్రియాంక సేవా సమితి అధ్యక్షుడు, రిటైర్డ్ జిల్లా న్యాయాధికారి మోహన్‌రావు, సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి, జూనియర్ సివిల్ న్యాయాధికారి దివ్య, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, మున్సిపల్ కమిషనర్ బేబి, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

30న నంద్యాలలో ఓపెన్ చెస్ టోర్నమెంట్

నంద్యాల హాస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో ఈ నెల 30న రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో బంకిం చంద్ర ఛటర్జీ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నంద్యాల చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామసుబ్బారెడ్డి తెలిపారు. వందేమాతరం గీతం 150సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నంద్యాల, కర్నూలు, కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాల స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఫిడే నిబంధనలకు అనుగుణంగా స్విస్ రౌండ్ పద్ధతిలో పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు నగదు బహుమతులతోపాటు ట్రోఫీలు, పతకాలు అందజేస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 27వ తేదీలోపు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీచెస్.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో ఎంట్రీలను నమోదు చేసుకోవాలన్నారు. పవన్‌కల్యాణ్‌రెడ్డి టోర్నమెంట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారన్నారు. వివరాలకు 90104 51585 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అహోబిలంలో ఏపీ డీసీఎంఎస్ ఛైర్మన్



మాట్లాడుతున్న హరిబాబు నాయుడు

ఆళ్లగడ్డ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి వారిని ఏపీ డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు బుధవారం దర్శించుకొన్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి లక్ష్మీ నరసింహస్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వారి జన్మనక్షత్రం కావడంతో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన వెంట టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సంజీవరాయుడు ఉన్నారు.

వైభవం.. ఆది దంపతుల కల్యాణం

- మహానందిలో ముగిసిన కార్తీక మాస ఉత్సవాలు



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆది దంపతుల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. కార్తీక మాసం అమావాస్య పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి కామేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. కామేశ్వరీదేవి అమ్మవారికి ఘనంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. యాగశాల మండపంలో పూర్ణాహుతి చేశారు. రాత్రి 7 గంటల నుంచి ఆలయం ప్రాంగణంలోని అభిషేకమండపంలో మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. దీంతో మహానందిలో కార్తీక మాసోత్సవాలు ముగిశాయి.



మహానందిలో లక్ష కుంకుమార్చన పూజలను నిర్వహిస్తున్న ఋత్వికులు

పింఛన్ల కోసం ఎదురుచూపులు

- కొత్త ఫించన్ల మంజూరు అయ్యేనా?
- నాయకులు హామీలు నీటి మూటలు
- 17నెలలైనా తెరుచుకోని సైటు
- ఆందోళనల్లో వృద్ధులు, కళాకారులు, కార్మికులు

ప్రభుత్వాలు ఇచ్చే కాస్తో.. కూస్తో పింఛను డబ్బులే వారికి జీవనాధారం.. అలాంటి పింఛన్లు కూడా రాకపోవడంతో వారి జీవనం దుర్భరమైంది. కన్న బిడ్డలు పట్టించుకోక.. అయిన వారి ఆదరణ లేక.. వయస్సు మీద పడి పనిచేసే సత్తువ లేక.. ఏదో సర్కారు ఇచ్చే పింఛన్ డబ్బులతో జీవనం సాగిద్దామనుకున్న వృద్ధులు, కళాకారులు, కార్మికులకు నిరాశే ఎదురైంది. కొత్త ప్రభుత్వంలో తమకు కాస్త ఆసరా ఉంటుంది అనుకుంటే అది కూడా లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 17 నెలలు దాటినా నేటికీ కొత్త పింఛన్లు రాకపోవడంతో వారంతా ఎదురుచూపులు చూస్తున్నారు. చేతిలో డబ్బుల్లేక.. మందులు కొనే స్థోమత లేక.. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తుండగా ప్రభుత్వ ప్రకటన కోసం పడిగాపులు కాస్తున్నారు. కొత్త పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



డీఆర్‌డీఏ కార్యాలయం నంద్యాల

నంద్యాల టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారోనని వృద్ధులు, కళాకారులు, కార్మికులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 17 నెలలైనా వారి ఆశలు అడియాశలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త ఫించన్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఇప్పటికి చాలా మంది ఎదురు చూపులు చూస్తు ఉండిపోయారు. 60 ఏళ్లు నిండిన అర్హత ఉన్న వద్ధులు, కల్లుగీత కార్మికులు, కళాకారులు తదితర వర్గాలకు చెందిన వేల మంది పింఛన్లు కోసం పడిగాపులు కాస్తున్నారు. 2024 ఎన్నికల్లో ప్రచారంలో పోటీల్లో ఉన్న ఆయా పార్టీల నాయకులు హామీలు ఇచ్చారు. అవి నేటికీ నెరవేరలేదు.

2023 నవంబరు నుంచి వెబ్‌సైట్‌ను..

2023 అక్టోబరు వరకు వచ్చిన పింఛన్లు దరఖాస్తు పరిశీలించి అర్హత ఉన్నవారికి అప్పటి వైసీపీ ప్రభుత్వం పింఛను మంజూరు చేసింది. 2023 నవంబరు నుంచి వెబ్‌సైట్‌ను పూర్తిగా మూసివేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సుమారుగా 17 నెలలు అవుతున్న సైట్‌ను తిరిగి ప్రారంభించే చర్యలు తీసుకోవడం లేదని అర్హులు వాపోతున్నారు. పలు సమావేశాల్లో సభల్లో పింఛన్లు ఎప్పుడిస్తారంటూ ప్రశ్నిస్తున్నా సరిమైన సమాధానం నాయకుల నుంచి రావడం లేదు.

డబ్బుల్లేక.. మందులు కొనలేక..

వృద్ధులు, నిరుపేద కళాకారులు, కల్లుగీత కార్మికులు అనారోగ్యానికి గురై కన్నబిడ్డల ఆదరణ నోచుకోని వారు డబ్బుల్లేక.. మందులు కొనలేక భారంగా బతుకు వెళ్లదీస్తున్నారు. పింఛను వస్తే ఆరోగ్యానికి మందులు కొనేవారమని, పోషణకు మందులకు కన్నబిడ్డల వద్ద చేయి చాచలేక రోజు గడిస్తే చాలనే భావనలో చాలా మంది ఉన్నా రు.

ఎన్నికలకు ముందు..

2026 సంవత్సరం ప్రారంభంలో పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల ప్రకటన చేశారు. ఎన్నికల ప్రకటనకు ముందు అర్హులకు ప్రభుత్వం కనికరిస్తుందనే చిన్నఆశ ఇపుడిప్పుడే తలెత్తుతోంది. 2023 నవంబరు నుంచి 2025 సెప్టెంబరు వరకు సుమారుగా 20 నెలలుకు పైగా గడిచింది. కొత్త పింఛన్లు అర్హత ఉన్నవారి గోడు ఆలకించి సైట్ తెరవాలని ఆయా వర్గాల ప్రజలు కోరుతున్నారు.

ఉత్తర్వులు రాగానే దరఖాస్తు చేసుకోవచ్చు

చాలారోజుల నుంచి సైట్ ఓపెన్ చేయడం లేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే అర్హులందరూ పింఛను మంజూరుకు దరఖాస్తు చేసుకోవచ్చు. స్థానికంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి తారతమ్యాలు లేకుండా పింఛన్లు మంజూరు చేస్తాం.

- శ్రీధర్‌రెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ, నంద్యాల



కార్యక్రమంలో పాల్గొన్న వాల్మీకులు

వాల్మీకి భవన్ ఏర్పాటుకు కృషి

ఘనంగా కార్తీక వనభోజనం



మాట్లాడుతున్న బోయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కేంద్రంలో వాల్మీకి భవన్ ఏర్పాటుకు కృషి చేస్తానని వాల్మీకి/బోయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ హామీ ఇచ్చారు. బుధవారం కర్నూలు శివారులోని ఎల్లమ్మ గుడి వద్ద ఉన్న శ్రీనివాస గార్డెన్స్‌లో వాల్మీకి కులస్థుల కార్తీక వన భోజనం ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కప్పట్రాళ్ల బొజ్జమ్మ మాట్లాడుతూ వాల్మీకి బోయలు అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలో బీసీ సామాజిక వర్గంలోని అధిక జనాభా కలిగిన బోయలు స్థానిక సంస్థలలో పోటీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ డీఎస్పీ బోయగడ్డ వెంకటరామయ్య, మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, వాల్మీకి వనభోజన కమిటి సభ్యులు తలారీ కృష్ణ నాయుడు, మద్దిలేటి, సత్రం రామకృష్ణుడు, శ్రీనివాసులు, రామనాయుడు, శేఖర్, విష్ణు, బేతంకృష్ణుడు, సంజన తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో వసూలు చేసిన పన్నులను స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాలని పీఆర్ కమిషనర్ ఆదేశించారు. బుధవారం డీపీవో కార్యాలయంలో పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వామిత్వ సంబంధించి గ్రామ సభలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీవో భాస్కర్, డీఎల్‌పీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు హాజరయ్యారు.

సత్యసాయి మందిరంలో త్రిశక్తి పూజలు





కర్నూలు కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భగవాన్ పుట్టపర్తి సత్యసాయిబాబా శత వర్ష జన్మదిన మహోత్సవాలు నగరంలో నెహ్రూనగర్‌లోగల శ్రీ సత్యసాయి మందిరంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 23 వరకు 9 రోజుల పాటు కొనసాగుతున్న ఈ ఉత్సవాల్లో ఐదో రోజున మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మందిరంలో సాయంత్రం మహిళలతో సామూహికంగా 'త్రిశక్తి పూజ' భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజలకు వందలాదిగా మహిళా భక్తులు హాజరయ్యారు. మహిళా శక్తిని చాటిచెప్పేలా మహాకాళి రూపంలో, సంపదల స్వరూపంగా మహాలక్ష్మి దేవి రూపంలో, సకల విద్యల స్వరూపంగా మహా సరస్వతి రూపంలో అమ్మవార్ల విగ్రహాలను నెలకొల్పి విభిన్న రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలదండలు వేసి నైవేద్యాలు సమర్పించారు. ఆధ్యాత్మిక ప్రవచన బోధకురాలు తెల్లాకుల జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో త్రిశక్తి పూజ ప్రారంభించారు. ఓంకార నాదంతో మొదలైన ఈ పూజల్లో త్రిశక్తి పూజ విశేషాలను ఆమె తెలియజేశారు. అంతకు ముందు మహిళా భక్తులతో వేద పఠనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. చివరగా మహిళా భక్తులకు వడిబియ్యం, మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఇతర ప్రతినిధులు సందీప్, సూర్యనారాయణ, మహిళా ప్రతినిధులు గీత, డాక్టర్ పార్వతి, సరోజ తదితరులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

మంచి పుస్తకం మన నేస్తం

- గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన కేంద్రాలు
- కొనసాగుతున్న పుస్తకాల పండుగ ..
- ఉమ్మడి జిల్లాలో ప్రతి రోజూ 3వేల మంది పాఠకుల సందర్శన

కొలిమిగుండ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతో మనుషుల సాంస్కృతిక స్థాయి పెరుగుతుంది. ఈ ప్రపంచంలో భాగమవుతారు. ప్రతి ఇంట్లో పిల్లలు, పెద్దలు చదవగల పుస్తకాలు ఉండాలి. ప్రతి ఊళ్లో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చగల పుస్తక కేంద్రాలు ఉండాలి. మంచి పుస్తకాలు చదివే వారి చుట్టూ అనేక మంది మంచి మిత్రులు ఉన్నట్లే. అందుకే గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలు కావాలి. మన ముందు తరాల జీవన విధానం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు పుస్తకాల రూపంలో తర్వాత తరాలకు అందుతాయి. అలాంటి వేలాది గ్రంథాలయాలు ఊరూరా ఏర్పాటు చేశారు. ఇందులో దిన పత్రికలు, దేశ చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలు, గ్రూప్స్‌తో పాటు ఇతర పోటీ పరీక్షల మేటీరియల్, విద్యార్థుల సిలబస్‌కు సంబంధించిన పుస్తకాలు, నవలలు, పురాణాలు, ఇతిహాసాలు, చిన్న పిల్లల కథల పుస్తకాలు, మాస పత్రికలు, వార పత్రికలు.. ఇలా ఒక్కటేమిటి మనిషి విజ్ఞానాన్ని పెంచే అన్నిరకాల పుస్తకాలు వచ్చి అర చేతిలో ప్రపంచం కనిపిస్తున్నా గ్రంథా

ఉండాలి. ప్రపంచంలోని ఆలోచనాపరులందరూ పుస్తక పఠనం ద్వారానే తమ మేధస్సును పెంచుకొని అద్భుతాలు సృష్టించారు. ఒకప్పుడు ప్రజలకు ఎటువంటి సమాచారం కావాలన్నా గ్రంథాలయాలకు వెళ్లేవారు. పుస్తకాల అవసరం తెలిసిన ఆనాటి మేధావులు, సంఘ సంస్కర్తలు గ్రంథాలయ ఉద్యమాలను నడిపారు. ఇందులో భాగమే నవంబరు14 నుంచి 20 వరకు ప్రభుత్వం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నది.

ఎన్‌టీఆర్ హయాంలో మండలాల్లో ప్రారంభమైన గ్రంథాలయ వ్యవస్థ

సమాజానికి విజ్ఞానాన్ని అందించాలన్న మహోన్నత ఆశయంతో 39 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మండల కేంద్రాల్లో గ్రంథాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకవచ్చారు. ఆ సమయంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో 57 గ్రంథాలయాలు ఏర్పాటయ్యాయి. వాటికి ఒక కార్యాలయం, గ్రంథాలయాధికారిని అందుబాటులోకి తెచ్చారు. గ్రంథాలయాల సహకారంతో ఎంతో మంది పేద విద్యార్థులు, నిరుద్యోగులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకున్న ఘటనలు ఉన్నాయి.

● విద్యార్థులు, పాఠకుల దరి చేర్చడానికే వారోత్సవాలు

గ్రంథాలయాల ప్రాముఖ్యతను, పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను తెలియజేయడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1968 నుంచి ప్రతి ఏటా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నాయి. నవంబరు 14 నుంచి, 20 వరకు ఈ వారోత్సవాలను నిర్వహిస్తూ పాఠకులకు గ్రంథాలయాలపై ఆసక్తి పెంచడానికి కృషి చేస్తున్నాయి. పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగేలా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు అధికారులు నిర్వహిస్తున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 21న బహుమతి ప్రదానం చేస్తున్నారు.

● గ్రంథాలయాలకు తరగని ఆదరణ

ఇంటర్నెట్ వ్యవస్థ పెద్ద ఎత్తున అందుబాటులోకి లయాలకు ఆదరణ తగ్గలేదని చెప్పవచ్చు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేటికీ 3వేల మందికి పైగా పాఠకులు గ్రంథాలయాలు సందర్శించడాన్ని బట్టి చూస్తే గ్రంథాలయాల ఆదరణ అర్థమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. విజ్ఞానాన్ని పెంచే గ్రంథాలయాల అభివృద్ధికి ఇటు ప్రభుత్వాలు, అటు ప్రజలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బనగానపల్లె గ్రంథాలయంలో వేలాది పుస్తకాలతో ప్రదర్శన



గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



మనిషి జ్ఞానాన్ని పెంచి, భవిష్యత్తుపై భరోసా కలిగించే గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. మన నాగరికత, చరిత్ర, వేదాలు, ఇతిహాసాలు, సాహిత్యం, పోటీ పరీక్షల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయి.

- రాజా మనోహర్, గ్రంథాలయ అధికారి

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఆదోని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదోని-ఇస్వీ రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయిసర్వేశ్వరరావు తెలిపారు. ఆదోని రైల్వేస్టేషన్ సమీపంలోని నల్లగేటు 495/34 కి.మీ. దగ్గర మృతదేహం లభ్యమైందని చెప్పారు. మృతుడి కుడి చేతిపై కేసీ, ఎన్‌టీఆర్ అనే అక్షరాలతో పచ్చ వేయించుకున్నాడని చెప్పారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులను సంప్రదించ వచ్చన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

జవాన్ మృతి


నాగార్జున (ఫైల్)

మద్దికెర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కురవ వీధిలో నివసించే జవాన్ కె.నాగార్జున (34) బుధవారం ఉదయం డెంగీ లక్షణాలు, పచ్చకామెర్ల వ్యాధితో మృతి చెందారు. వివరాలివీ.. నాగార్జున 2011లో ఇండో టిబెట్ బార్డర్ పోలీసుగా సైన్యంలో చేరారు. ఆరు సంవత్సరాల కిందట రాయదుర్గం మండలంలోని ఊటకల్లు గ్రామానికి చెందిన భారతిని వివాహం చేసుకున్నాడు. వీరికి శాన్వి అనే కూతురు కూడా ఉంది. అయితే.. బార్డర్ నుంచి వచ్చి తిరుపతి వద్ద గల కలికిరి క్యాంప్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే గత ఐదు రోజుల నుంచి జ్వరం వస్తుండటంతో సెలవుపైన గ్రామానికి వచ్చారు. జ్వరం తగ్గకపోవడంతో బళ్లారిలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. అయితే డెంగీ లక్షణాలు ఉండడం, పచ్చకామర్లు వ్యాధులు అధికం కావడంతో కోలుకోలేక మృతి చెందాడు. పోలీసులు పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఓపీడీ వైద్యశాలకు తరలించారు. అనంతరం మద్దికెర దహన సంస్కారాలు చేశారు. జవాన్ మృతి పట్ల పంచాయతీ సలహాదారు బండారు ఆంజనేయులు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, కురువ సంఘం నాయకులు గ్రామ ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

మహానంది, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం వద్ద మంగళవారం అర్ధరాత్రి మోటర్‌బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో గోపవరం గ్రామానికి చెందిన వెంకటకృష్ణ(22) అక్కడికక్కడే మృతి చెందాడు.


వెంకటకృష్ణ (ఫైల్)

ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాలివీ.. వెంకటకృష్ణ నంద్యాలోని రైల్వే స్టేషన్‌లో కుటుంబ సభ్యులను రైలు ఎక్కించి తిరిగి స్వగ్రామానికి తిమ్మయ్యతో కలసి బైకుపై బయలుదేరారు. సీతారామపురం గ్రామం సమీపంలో పొలం నుంచి లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. వెంకటకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన తిమ్మయ్యను చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపటి నుంచి అప్లికేషన్ డెవలపర్, డ్రోన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణలో భాగంగా శుక్రవారం నుంచి డ్రోన్ ఆపరేటర్, అప్లికేషన్ డెవలపర్‌లపై


మహబూబ్ బాషా

శిక్షణలు ప్రారంభిస్తున్నట్లు మహా యోగి లక్ష్మమ్మ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా, నైపుణ్య అభివృద్ధి కో ఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి ఆసక్తి ఉన్న వారు మహాయోగి లక్ష్మమ్మ డిగ్రీ కాలేజీ కొ ఆర్డినేటర్ సుధాకర్‌ను కలసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8885904099 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోసిగి నుంచి ఎమ్మిగనూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ఆకస్మాతుగా పెద్ద ఎత్తున పొగలు రావడంతో బస్సులోని ప్రయాణికులు భయభ్రాంతులకు గురై పరుగులు పెట్టారు.


పొగలు వచ్చిన బస్సు ఇదే

వివరాలివీ.. కోసిగి నుంచి మాలపల్లి మీదుగా ఎమ్మిగనూరుకు వస్తున్న బస్సు సాయంత్రం 6గంటల సమయంలో వడ్డికి రప్ప వంక దగ్గర ఉన్న పెట్రోలు బంకు సమీపంలోకి రాగానే బస్సులోని సైలెన్సర్ దగ్గర నుంచి పెద్ద ఎత్తున పొగలు వచ్చాయి. గమనించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కకు నిలిపి ప్రయాణికులను బస్సులో నుంచి సురక్షితంగా దించివేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పిల్చుకున్నారు. కండక్టరు ప్రయాణికులను వేరే బస్సులో వారి గమ్యానికి తరలించారు. దాదాపు 90 మంది ప్రయాణికులు ఉన్నట్లు కండక్టరు తెలిపారు.

పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం


మంటలను అర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నంద్యాల టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొగ్గులైన్‌లోని బీసీజీ పత్తి మిల్లులో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. బాధితులు నాగరాజు, నాగప్రసాద్, జిల్లా అగ్నిమాపక సహాయక అధికారి రఘునాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పత్తిమిల్లులోని ఓ మిషన్ నుంచి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్పందించిన సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారుగా 40 బేళ్ల పత్తి మంటల్లో కాలిపోయింది. విలువైన పరికరాలు కూడా దగ్ధం కావడంతో సుమారుగా రూ.80 లక్షలు వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 21 నుంచి డిసెంబరు 20 వరకు డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డా.ఎస్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 52 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు 3వ సెమిస్టర్‌లో రెగ్యులర్ 7,555, సప్లిమెంటరీలో 5,595 మంది, 5వ సెమిస్టర్లో రెగ్యులర్ 6,520, సప్లిమెంటరీలో 2,717 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకుని ఐడెంటీ కార్డుతో అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కంట్రోలర్ తెలిపారు.

చెంచులకు ఉచిత స్పర్శదర్శనం

- ప్రత్యేక కార్డులతో నెలలో ఓసారి అవకాశం
- మల్లన్న భక్తులకు ఉచిత ప్రసాదం
- కొలనుభారతి ఆలయం దత్తతకు ఓకే
- శ్రీశైలం ఆలయ ట్రస్టు బోర్డు కమిటీ తీర్మానం
- 11 అంశాలు ఆమోదం



సమావేశంలో అంశాలపై చర్చిస్తున్న ట్రస్టుబోర్డు సభ్యులు, అధికారులు

శ్రీశైలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మల్లన్న దర్శనంలో చెంచులకు మరింత వెసులుబాటు కల్పిస్తూ ట్రస్టుబోర్డు కమిటీ నిర్ణయం తీసుకుంది. నెలలో ఓసారి చెంచులకు మల్లన్న స్పర్శ దర్శనం కల్పించేలా నిర్ణయించారు. ఇందుకోసం చెంచులకు ప్రత్యేక కార్డులను కూడా జారీ చేయనున్నారు. బుధవారం శ్రీశైలం ట్రస్టుబోర్డు కమిటీ సమావేశమై పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఆలయ ఈవో శ్రీనివాసరావు, మండలి సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు, విభాగాధిపతులతో కలిసి కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా 14 అంశాలు చర్చకురాగా 11 అంశాలను ఆమోదం తెలుపుతూ, రెండింటిని వాయిదా వేసి, మరో అంశాన్ని తిరస్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు వెల్లడించారు. డిసెంబరు 1వ తేదీ నుంచి స్వామివారి స్పర్శ దర్శనం చేసుకున్న భక్తులకు 100 గ్రాముల బరువుగల రెండు లడ్లు, అతిశీఘ్ర దర్శనం వారికి 100 గ్రాముల బరువుగల ఓ లడ్డూను ఉచితంగా అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీచేసి నెలలో ఒకసారి చెంచులకు ఉచిత స్పర్శ దర్శనం కల్పిస్తారు. దేవదాయశాఖ ఉత్తర్వుల మేరకు సరస్వతీదేవి కొలువై ఉన్న కొలనుభారతి దేవాలయాన్ని దత్తత తీసుకుని ఆలయానికి సంబంధించిన భూములు, బంగారు వెండి వంటివి స్వాధీనపరుచుని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు యాత్రికులకు తగు ఏర్పాట్లను సిద్ధం చేయడం, ప్రధానాలయంలోని శ్రీగోకులాన్ని ఆధునీకరించడం, క్షేత్ర పరిధిలోని ప్రధాన కూడళ్లలో సమాచార సూచిక బోర్డులతో పాటు 'మే ఐ హెల్ప్ యు' యాత్రిక సహాయ కేంద్రాలు, పరిపాలనా విభాగం, క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు, అన్నదాన భవనం, ఆసుపత్రి, బస్టాండ్ వంటి కీలక ప్రాంతాల్లో ఫిర్యాదులు సలహాల పెట్టెలను ఏర్పాటు భక్తుల ఇబ్బందులను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సర్వ దర్శనం కోసం వేచిఉండే భక్తులకు తక్కువ సమయంలో దర్శనభాగ్యం కల్పించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంరక్షించుకుంటూ పరిసరాలు సౌకర్యాల కల్పన చర్యలను మరింత మెరుగుపరిచే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

కర్నూలులో స్టేట్ తలసేమియా సెంటర్

- రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణలో ఏర్పాటు
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


టీజీ వెంకటేశ్‌తో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొదటిసారిగా కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఆవరణలో స్టేట్ అడ్వాన్స్‌డ్ తలసేమియా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణలో సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి సభ్యులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. తమిళనాడు, డిల్లీ రాష్ట్రాల తరహాలో గర్భిణులకు తలసేమియా వ్యాధిని గుర్తించే జనిటిక్ టెస్టులను ఇక్కడే చేస్తారన్నారు. భవన నిర్మానానికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని టీజీ హామీ ఇచ్చారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డా.గోవిందరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వెయ్యి మంది తలసేమియా బాధితులు ఉన్నారని, వీరికి ప్రతి నెల రెండు, మూడుసార్లు రక్తమార్పిడి, మూడు నెలలకు బ్లడ్ టెస్టులు అవసరమని అన్నారు. వీరికి సైన సేవలందక మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు డా.కేవీ సుబ్బారెడ్డి, మీనాక్షి, గార్గేయపురం శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్ బాబురాజ్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యల నివారణలో ప్రభుత్వాలు విఫలం

- అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్.. ముగిసిన పత్తి రైతుల రాష్ట్ర సమ్మేళనం



మాట్లాడుతున్న రాజన్ క్షీరసాగర్

దోని అగ్రికల్చర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వాటిని నివారించడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్ అన్నారు. ఆదోనిలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి పత్తి రైతుల సమ్మేళనం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా రాజన్ మాట్లాడుతూ దేశంలో 60 కోట్ల మంది రైతులు ఉండగా అందులో 60 లక్షల మంది రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. పత్తికి సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు చేస్తున్న మోసాలపై కేంద్ర ప్రభుత్వంపై పోరాడుతూనే ఉన్నామన్నారు. పేదరికం తగ్గిస్తామని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వ్యవసాయాన్ని లాభసాటి చేస్తామన్న ప్రభుత్వాలు నేడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ నల్ల చట్టాలపై డిల్లీ రైతులు చేసిన పోరాటంపై మోదీ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నేటికీ నిలబెట్టుకోలేదన్నారు. పంటల మద్దతు ధరకు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామి నాథన్ సిఫారస్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ దిగుమతులపై 11 శాతాన్ని విధిస్తున్న సుంకాన్ని రద్దు చేయడం దుర్మార్గం అన్నారు. ఎరువుల కంపెనీలకు ఇస్తున్న రాయితీలను నేరుగా రైతులకే ఇవ్వాలన్నారు. వ్యవసాయ ఆధారిత పనిముట్ల ఎరువులు విత్తనాలపై విధించిన జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పత్తికి కనీస మద్దతు ధర రూ.12 వేలు కల్పించి పత్తి రైతులకు బోనస్ ఇవ్వాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కార్యదర్శి జగన్నాథం, గిడ్డయ్య, టీ వీరేష్, పారిశ్రామికవేత్త బత్తిని కుబేర్నాథ్ వెల్లాల మధుసూదన్ శర్మ, రేణుకాంబ స్వామి, శ్రీనివాసులు, రాజశేఖర్, సుదర్శన్, కల్లుబావి రాజు పాల్గొన్నారు.

రైతు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- రైతులకు అన్నదాత సుఖీభవ మెగా చెక్కు విడుదల


ఓర్వకల్లులో రైతులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఓర్వకల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, వారికోసమే సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం ఓర్వకల్లులోని పొదుపు ఐక్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత చెక్కులను విడుదల చేశారు. ముందుగా సీఎం చంద్రబాబు సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని తిలకించారు. అనంతరం కేక్ కట్ చేసి రైతులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం, కల్లూరు మండలాలకు చెందిన 27,378 రైతులకు రూ.22.02 కోట్లు రెండో విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులను విడుదల చేశామన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని చిన్నచూపు చూసిందని విమర్శించారు. తాము రైతు సంక్షేమమే ధ్యేయంగా అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్‌పథకాల్లో భాగంగా రైతులు నష్టపోకూడదన్న లక్ష్యంతో అన్నదాత సుఖీభవ నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పంట సాగు పెట్టుబడికి రైతులు ఇబ్బందులు పడకుండా రూ.20వేలు ఇవ్వడం హర్షణీయమన్నారు. నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఏడీఏ రాజశేఖర్, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో నాగ అనసూయ, నాలుగు మండలాల సొసైటీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ అనూరాధ

హోమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ అనూరాధ...

అహోబిలంలో సుదర్శన హోమం

పాల్గొన్న టీడీపీ ఎమ్మెల్సీ అనూరాధ

ఆళ్లగడ్డ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అహోబిలంలో లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా బుధవారం స్వామి, అమ్మవార్లుకు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిగువ అహోబిలంలో ఆలయ ప్రాంగణంలో స్వాతి సుదర్శన హోమాన్ని వేద పండితులు నిర్వహించారు. ఈవేడుకలలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. విజయవాడకు చెందిన టీడీపీ ఎమ్మెల్సీ అనూరాధ అహోబిలం లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేశారు. ఎమ్మెల్సీ ఆలయానికి చేరుకోగానే ఆలయ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. హోమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు వచ్చినట్లు చెప్పారు.

'దేవరగట్టు' మృతుడి కుటుంబానికి చేయూత

- రూ.లక్ష అందజేసిన తానా డైరెక్టర్ పొట్లూరి రవి


అంజనేయ భార్య ఈరమ్మకు చెక్కు ఇస్తున్న పొట్లూరు రవి

కర్నూలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తానా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్, ఎన్‌ఆర్‌ఐ పొట్లూరు రవి సహా ఎన్నారైలు మరోసారి దాతృత్వం చాటుకున్నారు. కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టు బన్ని ఉత్సవంలో జరిగిన తొక్కిసలాటలో ఆదోని పట్టణం అరుణజ్యోతి నగర్‌కు చెందిన చిన్న ఆంజనేయ మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబానికి పొట్లూరి రవి ఆర్థికసాయం చేసి అడగా నిలిచారు. అత్యంత నిరుపేద అయిన ఆంజనేయ మరణంతో ఆయన భార్య ఈరమ్మ, ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. రెక్కాడితే కాని పూట గడవని ఆ కుటుంబం కష్టాల్లో కూరుకుపోయింది. చిన్న ఆంజనేయ హిందూపురం ఎమ్మెల్యే, హీరో నందమూరి బాలకృష్ణకు వీరాభిమాని. ఆయన చేతిపై ఎన్‌బీకే అక్షరాలు పచ్చబొట్టు కూడా వేయించుకున్నాడు. మృతుడి కుటుంబ దీనస్థితిని బాలకృష్ణ అభిమాన సంఘం పొట్లూరి రవి దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన తానా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ పొట్లూరి రవి, ఎన్నారైలు వెంకట్ సుంకర, వేణు కోడే, సుబ్రమణ్యం ఒసురు తదితరులు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కును మృతుడి భార్య ఈరమ్మ, కుమారుడు రామాంజిలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, సందడి మధు, మీనాక్షి, మనోహర్ చౌదరి, బాబు, మార్కండి, నాగరాజ్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

డీడీఓ భవనాలకు హంగులు

(5వ పేజీ తరువాయి)

ముగ్గురు డివిజన్ స్థాయి అధికారుల పాలనా వ్యవహారాలు ఇక నుంచి ఈ కార్యాలయం నుంచే కొనసాగనున్నాయి. ఈ ముగ్గురు అధికారుల కార్యాలయాలకు అనుగుణంగా ఈ భవనాల్లో సౌకార్యలు కల్పిస్తున్నారు. ఇందుకు జిల్లా పరిషత్ నిధులు రూ.95.70 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో కార్యాలయాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులను చేపడుతున్నారు. అలాగే ఆరు డివిజన్ కేంద్రాల్లోని ఈ కార్యాలయాల్లో ఫర్నిచర్ మొదలైన వాటికి అదనంగా మరో రూ.10 లక్షలు కేటాయించారు. ఇప్పటికే ఈ భవనాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు దాదాపు పూర్తి అయినట్లు జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి తెలిపారు. ప్రతి డీడీఓ కార్యాలయానికి అవసరమైన మేర సిబ్బందిని కూడా డిప్యుటేషన్ పద్ధతిపై నియమించనున్నారు. ఒక్కో డీడీఓ కార్యాలయానికి ఒక సూపరింటెండెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, ఇద్దరు అటెండర్లను నియమించనున్నారు. ప్రతి డివిజన్‌కు ప్రత్యేకంగా నియమితులైన డీడీఓ ఆయా డివిజన్లలోని గ్రామ/వార్డు సచివాలయాల పర్యవేక్షణతో పాటు గ్రామ పంచాయతీల అభివృద్ధి, పన్ను వసూళ్ల అంశాలను పర్యవేక్షించనున్నారు.

ఒక్కో డివిజన్‌కు కేటాయించింది ఇలా:

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆరు డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాల భవనాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు జడ్పీ సాధారణ నిధులు రూ.95.70 లక్షలు కేటాయించారు. ఇందులో ఆదోని డీడీఓ కార్యాలయానికి రూ.16.50 లక్షలు, పత్తికొండకు రూ.19.00 లక్షలు, కర్నూలుకు రూ.15.00 లక్షలు, ఆత్మకూరుకు రూ.15.00 లక్షలు, నంద్యాల రూ.15.00 లక్షలు, డోన్‌కు రూ.14.00 లక్షలు కేటాయించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన


ఆలయంలో శివలింగాకారంలో దీపాలు వెలిగించిన భక్తులు

నంద్యాల కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల విశ్వనగర్‌లో వెలసిన గాయత్రీ విశ్వకర్మదేవస్థానంలో బుధవారం కార్తీకమాసం అమావాస్య సందర్భంగా భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఉత్సవమూర్తులకు బిల్వార్చన చేశారు. శివలింగం ఆకారంలో దీపాలు వెలిగించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో విశ్వనగర్ కాలనీ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


సైక్లింగ్ పోటీలకు ఎంపికైన మౌలాబీతో ఉపాధ్యాయులు

ఆత్మకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పింజరి మౌలాబీ అండర్-17 రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుంకన్న తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కర్నూలులో జరిగిన క్రీడాకారుల ఎంపిక పోటీల్లో మౌలాబీ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 21నుంచి విజయవాడలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. మౌలాబీని అధ్యాపకులు నరేష్, శంకరరెడ్డి, రవికుమార్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి

నంద్యాల హాస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లలితానగర్‌లోని గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్-19బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచినట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఈ నెల 15నుంచి 17వరకు కడపజిల్లా రైల్వేకోడూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19బేస్‌బాల్ పోటీల్లో పాఠశాల క్రీడాకారులు కరిముల్లా ద్వితీయ స్థానం సాధించి వెండి పతకం, బాలికల విభాగంలో కె.కృప తృతీయస్థానం సాధించి కాంస్య పతకం దక్కించుకున్నట్లు తెలపారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయుడు పుల్లయ్యను డైరెక్టర్, ఉపాధ్యాయులు అభినందించారు.

డిసెంబరులోగా పనులు పూర్తి చేస్తాం

- పీఐయూ ఈఈ రఘురామిరెడ్డి


పనులు పరిశీలిస్తున్న ఈఈ రఘురామిరెడ్డి, అధికారులు

కొత్తపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నుంచి కొకెరంచ వరకు చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు డిసెంబరు చివరిలోగా పూర్తి చేస్తామని పీఐయూ ఈఈ రఘురామిరెడ్డి తెలిపారు. ఆత్మకూరు నుంచి కొత్తపల్లి మండలం వయా దుద్యాల మీదుగా కొకెరంచ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.2కోట్ల నాబార్డు నిధులు మంజూరై ఆరునెలలైంది. అయితే కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనుల్లో జాప్యం జరిగింది. దాంతో 'ఆంధ్రజ్యోతి'లో 'నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు' అన్న కథనాన్ని ప్రచురించింది. సంబంధిత అధికారులు స్పందించి దుద్యాల-కొకెరంచ రోడ్డు పనులు ప్రారంభించారు. రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. పనులను పీఐయూ ఈఈ రఘురామిరెడ్డి, డీఈఈ వీరన్న, ఏఈఈ వెంకటరమణలు పరిశీలించి కాంట్రాక్టరుకు పలు సూచనలు చేశారు. పనులు ప్రారంభం కావడంతో దుద్యాల, మాడుగుల, కొకెరంచ, ఎదురుపాడు, నాగంపల్లి గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు


ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మధు

నంద్యాల, నూనెపల్లి 19 (ఆంధ్రజ్యోతి) : భారత స్వాతంత్ర్య సమరంలో అత్యంత ప్రసిద్ధమైన వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. మధు మాట్లాడుతూ.. ఝాన్సీ జీవితం, పోరాటం, ధైర్యం ఇప్పటికీ ప్రేరణగా నిలుస్తున్నాయన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తొలి మహిళా యోధురాలుల్లో ఒకరన్నారు. కార్యక్రమంలో గోస్పాడు బీజేపీ మండల అధ్యక్షుడు మధుగోపాల్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు బాలమని, నాగేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణాపురం శివరాంరెడ్డి, ఆచారి, రాయపాడు అగ్గిరయ్య, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి


మహిళకు చెక్కును అందజేస్తున్న చైర్‌పర్సన్, అధికారులు

నంద్యాల రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రతి పేదింటి మహిళ ఆర్థికంగా బలోపేతం కావడానికి శిల్పా సహకార్ బ్యాంకు ఎంతో ఉపయోగపడుతుందని చైర్‌పర్సన్ నాగినిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో బ్యాంకు ఆధ్వర్యంలో 72 వ అఖిల భారత వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 15 ఏళ్ల నుంచి మహిళల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని తెలిపారు. 13వేల మంది ఖాతాదారులు రూ.26 కోట్ల రుణాలు పొందారన్నారు. అనంతరం పలువురికి రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు రామాంజనేయులు, రుక్సానా, రాములు, సౌజన్య పాల్గొన్నారు.

రైతుల అవసరానికి ఆర్థిక సాయం

- ఎమ్మెల్యే జయసూర్య
- అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ చెక్కు అందజేత


బొల్లవరంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ చెక్కును రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య


ఆత్మకూరులో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ చెక్కును పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

నందికొట్కూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన సమయంలో అన్నదాతసుఖీభవ-పీఎం కిసాన్ డబ్బులు ఖాతాలో జమ కావడం సంతోషించదగ్గ విషయమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం మండలంలోని బొల్లవరం గ్రామంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జయసూర్య హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నాయన్నారు. సూపర్- 6 పథకాల అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 2వ విడతలో అర్హులైన రైతులకు రూ. ఏడువేలు మంజూరు చేశామన్నారు. నియోజకవర్గంలో 36,734 రైతు కుటుంబాలకు రూ. 24.94 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయిందన్నారు. రైతులు, ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలబడితే రాష్ట్రం ఎంతో అభివృద్ధి పథంలో నిలుస్తుందన్నారు. చెక్కును అన్నదాతల కు అందజేశారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఆర్‌డీవో నాగజ్యోతి, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రమణ్య శర్మ, ఏడీఏ గిరీష్, ఏఓ షేక్షావలి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, దేవెల్ల మురళి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి, సొసైటీ చైర్మన్లు, కన్వీనర్లు, అధికారులు పాల్గొన్నారు.

కూటమి పాలనతోనే సంక్షేమం

ఆత్మకూరు: కూటమి పాలనతోనే అన్నదాతల సంక్షేమం సాధ్యమని ఆత్మకూరు మార్కెట్ యార్డు చైర్మన్ వంగాల కృష్ణారెడ్డి, సింగిల్ విండో సొసైటీ చైర్మన్ షాబుద్దిన్ అన్నారు. బుధవారం పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం నిధుల చెక్కులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో ఆర్థికసాయం, ఎరువులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఆత్మకూరు ఏడీఏ హేమలత, తహసీల్దార్ రత్నరాధిక, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమర్ మాట్లాడుతూ.. శ్రీశైల నియోజకవర్గంలో 25018 మంది రైతులకు పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రెండో విడతగా రూ.17.08కోట్ల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు సందేశాన్ని వినిపించారు. సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తిరుపమయ్య, వీఆర్‌ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, టీడీపీ మండలాధ్యక్షులు రవీంద్రబాబు, నాయకులు శివప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, రాజారెడ్డి, కలిముల్లా, దినకర్, అధికారులు పాల్గొన్నారు.

కూటమిది చేతల ప్రభుత్వం

- మైనార్టీశాఖ మంత్రి ఫరూక్
- జిల్లెల్లలో చెక్కుల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

గోస్పాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మాటలు చెప్పదని చేతల్లో చేసి చూపిస్తుందని రాష్ట్ర మైనార్టీ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం జిల్లెల్ల గ్రామంలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ రెండో విడత చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వంచనలతో సాగిందని, కూటమి ప్రభుత్వం నమ్మకంతో సాగిపోతోందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు విజయవంతంగా ముందుకు తీసుకువెళ్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ నిధులు జమా అవుతాయన్నారు. నంద్యాల నియోజకవర్గం నుంచి 12,953మంది రైతుల ఖాతాల్లో రూ.8.78కోట్లు జమ అయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి, ఏడీఏ జయప్రకాష్ రెడ్డి, ఏవో స్వప్నిక, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తులసీశ్వర రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ హరిబాబు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సదాశివరెడ్డి, రామగోపాల్‌రెడ్డి, భాస్కర రెడ్డి పాల్గొన్నారు.

- కాగా, మంత్రి ఫరూక్, జేసీ కార్తీక్ ముందు రైతులు సమస్యలను ఏకరువు పెట్టారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో అన్నీ తప్పులతడకగా జరిగాయని వాపోయారు. త్వరలోనే పరిష్కరిస్తామని జేసీ హామీ ఇచ్చారు.

గ్రంథాలయ సెస్సు నిధులు త్వరలో చెల్లిస్తాం

- మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న
- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించిన కమిషనర్, అధికారులు

నంద్యాల కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సెస్సు నిధులను త్వరలోనే చెల్లిస్తామని మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న తెలిపారు. బుధవారం పట్టణంలోని పింగళిసూరన స్మారక శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ బండిశేషన్న హాజరై కృష్ణదేవరాయల ఆస్థాన అష్టదిగ్గజ కవులలో ఒకరైన పింగళిసూరన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. ముగింపు వేడుకల్లో వక్తల ప్రసంగాలు, విద్యార్థులు కోలాటప్రదర్శన, పద్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథులకు, కవులకు, సన్మానాలు చేశారు. కార్యక్రమం లో గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి శ్రీధర్, వసుంధరదేవి, కవులు కొప్పుల ప్రసాద్, నీలకంఠమాచారి, రవి,శివలక్ష్మీ, విజయభాస్కర్‌రెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

పాణ్యం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి, ఎంపీపీ ఉశేన్‌బీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, మోడల్ పాఠశాల అధ్యాపకురాలు పర్వీనా, లక్ష్మీగాయత్రి, ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పగిడ్యాల: విద్యార్థులు గ్రంథాలయాల్లో లభించే వివిధ రకాల పుస్తకాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య సూచించారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. మహిళా దినోత్సవం సందర్భంగా జడ్పీటీసీని గ్రంథాలయ అధికారి మద్దమ్మ సన్మానించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శేషన్న తదితరులున్నారు.

క్షేత్ర పాలకుడికి అమావాస్య పూజలు


శ్రీశైల క్షేత్ర పాలకుడు వీరభద్రుడు



మహానందిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీశైలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు అమావాస్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి వార పూజల్లో భాగంగా విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల సమయంలో ఆలయ ప్రాకారంలోని జ్వాలా వీరభద్రునితోపాటు క్షేత్ర పాలకుడైన బయలు వీరభద్రుడికి శుద్ధజలాలు, పంచామృతాభిషేకాలు, పుష్పార్చనలు, ప్రత్యేక నివేదనలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. క్షేత్ర దర్శనం చేసుకోలేని వివిధ రాష్ట్రాలకు చెందిన 39 మంది భక్తులు పరోక్షసేవలో తమ గోత్రనామాలతో పాల్గొన్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ దక్షిణ మాడవీధిలో ఏర్పాటు చేసిన ధర్మపథం కళావేదికపై రాజమండ్రికి చెందిన సుమాంజలి నాట్యాలయం వారి బృందం చేసిన సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.


మహానంది: మహానంది క్షేత్రంలో కార్తీక మాసం ముగింపు పురస్కరించుకొని బుధవారం వందలాదిమంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరుల్లో కార్తీక పుణ్య స్నానాలను భక్తులు ఆచరించారు. పరిసరాల్లోని నాగులకట్టతో పాటు మహా ముఖద్వారం ముందు, ధ్వజస్తంభం వద్ద మహిళా భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. సాయంత్రం వరకు మహానంది పరిసరాలు భక్తుల సందడి నెలకొంది.

అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన పనులు


పాత వంతెనను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల, రూరల్ 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని కుందూనది పాత వంతెనకు మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించినప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆరోపించారు. బుధవారం సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాత వంతెనను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నంద్యాల నుంచి మునగాల, పులిమద్ది, గడివేములకు రహదారి నిమిత్తం దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి కుంగిపోయే దశలో ఉందన్నారు. నిధులు లేవని సంబంధిత అధికారులు చేతులెత్తేయడం దుర్మార్గమన్నారు. బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, పట్టణ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

108 జంటలతో పంచామృతాభిషేకం


సాలగ్రామాలకు అభిషేకం చేస్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉమామహేశ్వర ఆశ్రమంలో కార్తీకమాసం అమావాస్య సందర్భంగా బుధవారం సాయంత్రం బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో 108 సాలిగ్రామాలకు 108 మంది జంటలతో పంచామృత అభిషేక కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు నగరడోణ సుధీర్, భక్తులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే టీడీపీ ధ్యేయం


సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

వెలుగోడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని టీడీపీ నాయకులు శేషిరెడ్డి, అబ్దుల్ కలాం, మండ్ల శంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రైతు సేవాకేంద్రంలో రెండవ విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల చేశారు. టీడీపీ నాయకులు, రైతులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, రసూల్, ఖలీల్, శాలుబాషా, రాజశేఖరరెడ్డి, వ్యవసాయాధికారి స్వాతి, అధికారులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన


ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాబోలు గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ శంకుస్థాపన చేశారు. బుధవారం బీసీ కాలనీలో ఈవ్ సొసైటీ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ నిర్మించనున్నారు. ఆయన మాట్లాడుతూ చాబోలు ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తున్న ఈవ్ సొసైటీ ఇన్‌చార్జి బండి సాలమ్మను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ చిన్నహుసేన్, ధనంజయ, రామచంద్రుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పాములపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్‌బాష డిమాండ్ చేశారు. మండలంలోని బానుముక్కల, బానకచెర్ల, వేంపెంట, చెలిమిల్ల, లింగాల, ఇస్కాల గ్రామాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. నాయకులు రమేశ్‌రెడ్డి, హరినాథ్ బాబు, సయ్యద్‌ఇబ్రహీం, దామరేకుల రవి, నూర్‌మహమ్మద్ , రామచంద్రయ్య పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్థానిక కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో సెక్యూరిటీ అనలిస్ట్ కోర్సుకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ లేదా బీటెక్, డిప్లొమా చదివిన వారు అర్హులని చెప్పారు. శిక్షణ 3 నుంచి 4నెలల ఉంటుందని అన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7673902328 సంప్రదించాలని అన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

పాణ్యం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కోఆర్డినేటర్ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఏవీ రమణయ్య, ఎంపీపీ ఉశేన్‌బీ, సిబ్బంది పాల్గొన్నారు.

పాములపాడు: సర్పంచులు, ఉప సర్పంచులు సమన్వయంతో పని చేసి గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్థుడిపై తలారి దాడి

పాణ్యం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో తలారి గ్రామస్థుడిపై దాడి చేశాడు. ఈ ఘటన కౌలూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. బాధితుడి కుమారుడు నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివరామ రంగయ్య ఇంటి పన్ను చెల్లించి, రశీదు కోసం పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లాడు. తలారి ఆంజనేయులు మద్యం మత్తులో తన తండ్రిని దుర్భాషలాడుతూ దాడి చేశాడన్నారు. ఈ విషయాన్ని డీటీ శివశంకర్ రెడ్డికి ఫిర్యాదు చేశామన్నారు. తలారికి షోకాజ్ ఇచ్చామని డీటీ తెలిపారు.

అందరూ చదువుకుంటేనే అభివృద్ధి

బండిఆత్మకూరు నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీవో గాయత్రి, ఏపీవో వసుధ అన్నారు. బుధవారం స్థానిక మహిళా భవన్‌లో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యుల బోధన శిక్షకుల సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, రమేష్‌నాయుడు, టీఏలు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శారదాబాయి

గడివేముల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): లెప్రసీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శారదాబాయి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి లెప్రసీ సర్వేను పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి చర్మం మీద ఉన్న మచ్చలను గుర్తించాలని అన్నారు. అనుమానిత కేసులను నమోదు చేసుకొని మండల వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సహలాంబాష, సీహెచ్‌వో మార్గరేట్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మూలపెద్దమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి


ఎమ్మెల్యేను కలిసిన మూలపెద్దమ్మ ఆలయ కమిటీ సభ్యులు

గడివేముల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మూలపెద్దమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే గౌరుచరిత సూచించారు. నూతన ధర్మకర్తల మండలి సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ రమణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి


మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

నంద్యాల రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంత్రి ఫరూక్ డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలని వైసీపీ నాయకుడు రసూల్ ఆజాద్, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా హితవు పలికారు. బుధవారం స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నంద్యాలలో మంత్రి కుటుంబం వల్ల మైనార్టీలకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. వైసీపీపై మంత్రి, వారి కుటుంబ సభ్యులు అసత్య ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. గతంలో కూడా చాలా మందిపై కేసులు కట్టించారని ఆరోపించారు. కేవలం వైసీపీ హయాంలోనే మైనార్టీలకు న్యాయం జరిగిందన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు ఆరీఫ్ నాయక్, కలాంబాష, గన్నీ కరీం, సలాముల్లా పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

బేతంచెర్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం మండలంలోని ఎంబాయి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు సక్రమంగా పోషకాహారాన్ని అందించాలన్నారు.

కౌన్సిల్‌కు వచ్చి ప్రశ్నించండి

వైసీపీ కౌన్సిలర్లకు ఎమ్మెల్యే అఖిలప్రియ పిలుపు

ఆళ్లగడ్డ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశాలకు వచ్చి ప్రజా సమస్యలపై ప్రశ్నించాలని వైసీపీ కౌన్సిలర్లకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాంలింగారెడ్డి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అఖిలప్రియ పాల్గొని ప్రసంగించారు. ప్రజల కోసం కౌన్సిల్ సమావేశంలో మాట్లాడే వారికే రాబోయే రోజుల్లో టికెట్లు ఇస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఆళ్లగడ్డలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామన్నారు. అలాగే పలు కాలనీల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. తమ కాలనీల్లో సీసీ రోడ్లు గుంతలమయంగా మారి నీరు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నట్లు కౌన్సిలర్లు బాషా, సుధామణి ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే షాదీఖానాలో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చాలని, ఈద్గా వద్ద నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బంది మారిందని వైస్ చైర్మన్ నబీ రసూల్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకునేందుకు కమిటీ వేయండి

ఆళ్లగడ్డ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దొర్నిపాడు మండలంలో హెల్త్ అండ్ వెల్త్ పేరుతో మోసపోయిన బాధితులకు న్యాయం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కలెక్టర్ రాజకుమారిని కోరారు. బాధితులందరికీ న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాల నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే కలెక్టర్‌ను కలిసి దొర్నిపాడు బాధితుల విషయాన్ని వివరించారు. వెంటనే తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీఎస్పీ ప్రమోద్ ఉన్నారు.

స్పాట్ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

బనగానపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 20వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని ప్రిన్సిపాల్ లలిత బుధవారం తెలిపారు. డిగ్రీలో గణితం, జంతుశాస్త్రం, రసాయనిక శాస్త్రం, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, హిస్టరీ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు కళాశాలకు సరైన పత్రాలతో వచ్చి అడ్మిషన్ పొందవచ్చన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

డోన్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పులి పాటి క్రిష్ణయ్య అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఉచితంగా వచ్చిన పుస్తకాలను ప్రిన్సిపాల్ అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంసెట్, నీట్, ఐఐటీ, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్, ప్రాక్టికల్స్ సంబంధించిన మాన్యువల్స్‌ను ప్రభుత్వం పంపించిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి



డోన్‌లో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఐ ఇంతియాజ్ బాషా, నాయకులు

డోన్ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వేడుకలను బీజేపీ పట్టణ అధ్యక్షుడు బద్రి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటానికి బీజేపీ నాయకులతో కలిసి బద్రి సుధాకర్ పూలమాలలు వేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు కిరణ్, ఐటీ కన్వీనర్ వీరేష్‌బాబు, మండల అధ్యక్షుడు బొంకూరి రవికుమార్, పట్టన కార్యదర్శి ఆల శివప్రకాష్, నాగేంద్ర పాల్గొన్నారు.

● డోన్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడు కలు నిర్వహించారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయవాదులు కడిమెట్ల నారాయణ, టీ.నాగరాజు గౌడు, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ధర్మకర్తల కమిటీ చైర్మన్ వీర నారాయణ ఆచారి, రిటైర్డు హెచ్‌ఎం దూదేకుల జాకీర్ హుశేన్ పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక కోదండ రామాలయంలో స్వాతంత్ర సమర యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను స్వామిజీ అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వీరపోరాటం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానిదేవి, మహిళలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం

అవుకు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా అయ్యప్పస్వామి మాలాధారులు స్వామివారి చిత్రపటాన్ని ట్రాక్టరులో ఉంచి అరటి బెరల్లు, పుష్పాలతో అలంకరించారు. అయ్యప్పస్వామిని పట్టణ వీధుల్లో ఊరేగించారు.

కొలిమిగుండ్ల: మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీక మాసం బుధవారం పురస్కరించుకొని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అయ్యప్ప మాలాధారులు స్వామివారిని దర్శించుకున్నారు.

21 నుంచి అయ్యప్పస్వామి విళక్కి పూజ

కోవెలకుంట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 21వ తేదీ నుంచి 23 వరకు అయ్యప్పస్వామి విళక్కి పూజ నిర్వహిస్తున్నట్లు గురుస్వామి కె.మురళీకృష్ణ తెలిపారు. బుధవారం కోవెలకుంట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21న గణపతిపూజ, రక్షాబంధనం, అఖండదీప స్థాపనం, నవగ్రహ మంట పారాధన, గణపతి హోమం నిర్వహిస్తామన్నారు. 22న పవిత్ర జాలలను దీక్షా స్వాములచే సంగ్రహించి సింగరిమేళంతో గుడి వద్దకు తీసుకుని వచ్చి అయ్యప్పకు అష్టోత్తర శత కలశ స్థాపనం అష్టాభిషేకం, సాయంత్రం విళక్కి, గ్రామోత్సవం, 23న పడిపూజ నిర్వహిస్తామన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

● అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ చెక్కుల విడుదల

ఉయ్యాలవాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం మండలం కేంద్రంలోని స్థానిక ఫంక్షన్ హాలులో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కులను ఆమె విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ రెండో విడతలో భాగంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 42,981 మంది రైతులకు రూ. 29.13 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఒక్కో రైతులకు రూ. 7 వేల చొప్పున ప్రభుత్వం ఇస్తుందని ఆమె తెలిపారు. మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఇంజేడు, సుద్దమల్ల, నర్సిపల్లె గ్రామాల్లో హరివరం కేసీకెనాల్ చానల్ ద్వారా సాగునీరు అందిం చేందుకు రూ. 22 కోట్ల నిధులు సీఎం చంద్రబాబు ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాసులు, ఏడీఏ విజయశేఖర్, తహసీల్దారు ప్రసాద్ బాబు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, టీడీపీ మండల కన్వీనర్ బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కూడాల నారాయణరెడ్డి, మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నర్సిరెడ్డి, కర్నాటి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

డోన్ టౌన్: అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద డోన్ నియోజకవర్గంలో 35011 మంది రైతులకు రూ.23.64 కోట్లు నిధులు విడుదలయ్యాయని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నుముక మాత్రమే కాకుండా జాతీయ ఆర్థిక వ్యవస్థను పునాది అని అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు హెచ్‌కే నాయుడు, రైతు సంఘం నాయకులు కల్లూరి శివయ్య, ఉడల మద్దయ్య పాల్గొన్నారు.

బనగానపల్లె: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేవీకే కో-ఆర్డినేటర్ ధనలక్ష్మి అన్నారు. బుధవారం బనగానపల్లె నియోజకవర్గంలోని రైతులకు అందజేసే పీఎం కిసాన్ నిధి 21వ విడత నగదు బదిలీ, అన్నదాత సుఖీభవ పథకం పథకం ప్రత్యేక్ష ప్రసారం కార్యక్రమం ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబులు ఈపథకాన్ని ప్రారంభించారు. దీన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. బనగానపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా అందిస్తున్న రూ.7వేలు ప్రతి రైతుకు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, కృష్ణమూర్తిలు మాట్లాడారు. ఈసందర్భంగా నూతన రకాల విత్తనాలు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శించారు. కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకుడు సుధాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల మండ లాల్లోని 40,664 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కిద రూ.20.33 కోట్లు పీఎం కిసాన్ పథకం కింద రూ.7.10 కోట్లు మొత్తం 27.43 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా రైతులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దారు నారాయణరెడ్డి, ఎంపీడీవో నాగరాజు, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, కోరమాండల్ ఏడీ అనిల్ కుమార్‌రెడ్డి, సురేశ్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భూషన్న పాల్గొన్నారు.



రైతులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

కొలిమిగుండ్ల: ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ, కేంద్రం అందిస్తున్న పీఎం కిసాన్ నిధులు బుధవారం విడుదలయ్యాయి. ఈఏడాదికి సంబంధించి రెండో విడత కేంద్రం రూ.2000, రాష్ట్రం రూ.5వేల మొత్తం రూ.7వేల నిధులు రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. దీంతో మండలంలోని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది ప్రత్యేక టీవీలు ఏర్పాటు చేసి, పీఎం, సీఎం ప్రసంగాలను రైతులకు వినిపించారు. మండలంలో మొత్తం 6197 మంది రైతులకు రూ.4.10 కోట్లు రైతులకు లబ్ధి చేకూరినట్లు ఏవో శారదాదేవి తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు సుబ్రహ్మణ్యం, సునియాబేగం, సందీప్, చంద్ర, చిన్నయ్య, బాషా, జయదీప్ పాల్గొన్నారు

చాగలమర్రి: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మౌలాలి అన్నారు. బుధవారం చాగలమర్రి రైతు సేవా కేంద్రం వద్ద అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కరపత్రాలను ఆవిష్కరించి హర్షం ప్రకటించారు. 6,807 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ కింద రూ.4.71 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేసిందని అన్నారు. ఏఈవో మంజుల, దివ్య, టీడీపీ నాయకులు కొలిమిషరిఫ్, గుత్తి నరసింహులు, జెట్టి నాగరాజు, అనిఫ్, జల్సాగౌస్, ఫరూక్, కరిముల్లా, సురేష్, రమేష్, మాబుహుసేన్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు సిద్ధి సత్యం, లింగుట్ల వెంకట్‌నాయుడు, శివకుమార్‌రెడ్డిలు అన్నారు. బుధవారం గ్రామంలోని సచివాలయాలు, రైతు సేవా కేంద్రం లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడతపై రైతులకు ప్రభు త్వం అందించే పథకాలను వివరించారు. మండలంలో 11,381 మంది రైతులకు రూ.4.51 కోట్లు మంజూరైందని, ఈ నగదును వారి ఖాతాల్లో జమ చేసినట్లు తహసీల్దార్ సుభద్ర, ఏవో ప్రమీల తెలిపారు.



బనగానపల్లెలో రైతులకు చెక్కు అందిస్తున్న కేవీకే కో-ఆర్డినేటర్ ధనలక్ష్మి, మార్కెట్ యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి



బెలుంలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న రైతులు



చాగలమర్రిలో అన్నదాత సుఖీభవ పోస్టర్లతో హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

అవుకు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి రామదాసు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలు విజయకుమారి, ఏఎన్‌ఎం వెంకటేశ్వరమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

బనగానపల్లె: మహిళా సాధికారతతోనే దేశం ముందంజలో ఉంటుందని రిటైర్డు హెచ్‌ఎం శ్రీరాములు అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి రిటైర్డు హెచ్‌ఎం శ్రీరాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి మధుశేఖర్, సిబ్బంది గీతా మాధురి, పాఠ కులు, మహిళలు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని భారతీ విద్యామందిరంలో బుధవారం గ్రంథాలయాధికారి రామచంద్రుడు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలే ఖనం పోటీలు నిర్వహించారు. కమిటీ సభ్యులు, సుబ్బారావుగుప్త, మేడా ప్రభాకర్, హెచ్‌ఎం ప్రసాద్, లాలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: స్థానిక గంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆమె చిత్రపటానికి గ్రంథాలయాధికారి అఖిలాబేగం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిటైర్డు హెచ్‌ఎం



అవుకులో..

బేతంచెర్ల: స్థానిక గంథ్రాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం హరికృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారి మధుశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి: ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇంద్రావతి

శిరివెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు భాస్కర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జనార్దనుడు, ఎన్‌సీసీ కన్వీనర్ ఖాసీంసాహెబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న తహసీల్దారు

రుద్రవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దారు టోనీ ఆల్‌ఫ్రెడ్ అన్నారు. బుధవారం రాత్రి రుద్రవరంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వార్డెన్ లక్ష్మీనరసమ్మ, వీఆర్వో సంజీవరెడ్డి ఉన్నారు.

పుస్తకాల పంపిణీ

ప్యాపిలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదవాలన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి

కొలిమిగుండ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో అబ్దుల్‌కలాం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలంలోని కనకాద్రి పల్లె గ్రామంలోని పాఠశాలను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఆళ్లగడ్డ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు అక్టోబర్‌లో ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ఏర్పాటు చేయక పోవడంతో రైతులు ఎకరానికి రూ.20 వేలు నష్టపోతున్నారన్నారు.

700 ఎకరాల్లో పండ్ల తోటల సాగు

చాగలమర్రి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల క్లస్టర్ పరిధిలో 700 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం పూర్తి చేసినట్లు ఉపాధి ఏపీడీ సాంబశివరావు తెలిపారు. బుధవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల సాగు రైతులకు లాభాదాయకమన్నారు. 2026-27 సంవత్సరానికి ఉపాధి పనుల ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు 90 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎరుకలు రాజకీయంగా రాణించాలి

ప్యాపిలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎరుకలు రాజకీయంగా, ఆర్థికంగా రాణించాలని ఏపీ ఎరుకుల సేవా సమితి అధ్యక్షురాలు మనోరమ అన్నారు. బుధవారం పట్టణంలోని ఏకలవ్య విగ్రహం దగ్గర ఎరుకుల సమావేశాన్ని నిర్వహించారు. మనోరమ మాట్లాడుతూ ఎకుకులు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్లప్ప, గోపాల్, శేఖర్, శేషాద్రి, వెంకటేటేశ్వర్లు, సురేంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

రుద్రవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి తాజ్‌బాబా రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థిని అభినందించారు. నంద్యాలలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నజియా, బషీర్, రజని పాల్గొన్నారు.

కాదరబాదరలో సంచారసేవలు

శిరివెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాదరబాదర గ్రామంలో వైద్యులు బుధవారం సంచారసేవలు అందించారు. వైద్యుడు ముఖేష్ మాట్లాడుతూ ముందస్తు వ్యాధి నిర్ధారణ వలన క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చని అన్నారు. ఆరోగ్య సిబ్బంది నేరుగా ఇంటివద్దకే వచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

కొలిమిగుండ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో కుష్ఠ వ్యాధి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ వైద్యుడు హరిచరణ్‌రెడ్డి సిబ్బందికి ఆదేశించారు. బుధవారం మండ లంలోని గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాలని, అనుమా నాస్పద కేసులను ఆసుపత్రికి పంపాలని సూచించారు.

సబ్సిడీపై దాణా పంపిణీ

రుద్రవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తరేణిపల్లె గ్రామంలో 50 శాతం సబ్సిడీపై బుధవారం పశువుల దాణా పంపిణీ చేసినట్లు పశువైద్యశాఖ ఇన్‌చార్జి ఏడీ మనోరంజన్ ప్రతాప్ తెలిపారు. ఒక్కో బస్తా ధర రూ.1,110 కాగా 50 శాతం సబ్సిడీపై రూ.550 రైతు వాటా కింద చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆలమూరు పశవైద్యాధికారి నాగప్రసన్న, ఎఎహెచ్ఏ శ్రీవాణి, గోపాలమిత్ర హుసేని పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలు

కోవెలకుంట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం కోవెలకుంట్ల శాఖ గ్రంథాలయంలో అధికారి బాలతిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున పర్యవేక్షణలో విద్యార్థులు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి, తిరుపతిరెడ్డి, గిద్దలూరు గ్రంథాలయాధికారి మద్దిలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత గ్రామాలే లక్ష్యం



బాచాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఆళ్లగడ్డ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుష్ఠ వ్యాధి లేకుండా చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి స్వాతి తెలిపారు. బుధవారం మండలంలోని బాచాపురం గ్రామంలో కుష్ఠ వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురికి వైద్య పరీక్షలు చేశారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి ప్రాణాంతకం కాదు

చాగలమర్రి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి ప్రాణాంతకమైన కాదని ముత్యాలపాడు ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు అన్నారు. బుధవారం చింతలచెరువు గ్రామంలో ఇంటింటికి వెళ్లి కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వారికి అవగాహన కల్పిం చారు. 1205 గృహాలు సర్వే చేయగా 51 అనుమానిత కేసులు గుర్తించామని వారు తెలిపారు. ఏఎన్‌ఎం మాధవి, ఆశా వర్కర్ వరలక్ష్మి, వలంటీర్ రామకృష్ణ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి: ఎంపీడీవో

కోవెలకుంట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో వరప్రసాద్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ప్రజాప్రతినిధులు ప్రజలకు తెలియజే యాలని సూచించారు.

రుద్రవరం: మండలంలోని గ్రామాల్లో పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని శిక్షకులు షాహినూర్, పాములేటి అన్నారు. బుధవారం మండల సమావేశ భవనంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఒకరోజు శిక్షణ సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు.

చాగలమర్రి: గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మండల ట్రైనర్ సుజాత, తారకేశ్వరి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఎల్ఎస్‌డీజీ, ఆర్‌జీఎస్ఏ వార్షిక ప్రణాళికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవో తారకేశ్వరి, ఎంసీవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: స్థానిక మండల పరిషత్ భవనంలో బుధవారం పరిశుభ్రత, పచ్చదనంపై శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఉయ్యాలవాడ: గ్రామాల పారిశుధ్యంలో సర్పంచ్‌లో కీలకమని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఉపాధి ఏపీవో హరిక్రిష్ణ ఉన్నారు.



కోవెలకుంట్లలో మాట్లాడుతున్న ఎంపీడీవో వరప్రసాదరావు



చాగలమర్రిలో మాట్లాడుతున్న మండల ట్రైనర్ సుజాత

సంజామల: పారిశుధ్య నివారణలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఎంపీడీవో సాల్మన్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు, ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంఈవో రమణారెడ్డి, ఏపీవో ప్రకాష్ పాల్గొన్నారు.